ఈవారం కథ

'అమ్మవారిలావుంది'

పూజారి గవరయ్యగారు ఎంత ప్రయత్నించినా అమ్మవారి పూజమీద మనసు నిలవడం లేదు. ఆయన యాభై ఏళ్ళ నిష్టతో కూడిన జీవితంలో అమ్మవారి నిత్యార్చనలో మనసు చెదిరి ఆలోచనలు పరిపరివిధాలుగా పోవడం గత కొద్ది సంవత్సరాలుగా జరుగుతోంది. నిశ్చలమైన సరస్సులాటి తన జీవితంలో కనిపించని పెనుభూతమేదో విసురుతూన్న రాళ్ళతో జీవితం ఛిద్రమవుతోంది. వద్దు అనుకొన్నా, గతంలోకి ఆలోచనలు పరిగెడుతున్నాయి.



—ఓ.ఆర్.ఇందు

ఆ మారుమూల కుగ్రామంలో ఊరిచివర, కాలవ ఆవలి ఒడ్డున వున్న కనకదుర్గమ్మ గుడి అర్చకత్వం, దరిద్రమూ తన తండ్రి వారసత్వంగా ఇచ్చిపోయాడు. జీవితంలో ఆశలూ, ఆకాంక్షలూ ఏమీ లేని తను దుర్గమ్మను సేవించడం దైవమిచ్చిన వరంగా భావించాడు. అణకువే ఆస్తిగా తెచ్చిన అర్ధాంగి పార్వతి తనకిది కావాలని ఏనాడూ అడిగి ఎరగదు. తనకే ఓ కొడుకునీ, ఇద్దరు- కూతుళ్ళనీ ప్రసాదించింది. పెరుగుతూన్న కుటుంబ భారాన్ని ఎలా మోయాలో, పేదరికపు కోరల్లోంచెలా బయట పడాలో తెలియదు. తెలిసిందల్లా 'ధేహీ' అని ఎవరి ఎదుటా చేయి చాచకపోవడం, వున్న దాంతో గుట్టుగా సంసారాన్ని నెట్టుకపోవడం. నిజానికి గుడి ఆదాయం తక్కువేమీ కాదు. గుడి మీద వచ్చే ఆదాయమంతా ఆ ఊరి మోతుబరి పెత్తందారు, గుడి ధర్మకర్త నాయుడే కైంకర్యం చేస్తాడు. హుండీపై వచ్చే డబ్బు నాయుడి పద్దులోకీ, భక్తులు అమ్మవారికి చదివించే పట్టుచీరలు నాయుడి చిన్నింటికీ వెడతాయని తనకు తెలుసు. పూజారిగా తనకి దక్కేది కాసిని కొబ్బరి చిప్పలు, స్వల్పమైన జీతం మాత్రమే. జీతం పెంచమని అడుగుదామని నాయుడ్ని కలుస్తాడు. నోరు పెగలక తన అశక్తతకి తానే నిందించుకుంటాడు. ప్రక్క టౌన్లో వున్న హైస్కూల్లో ఎలాగోలా చదువు పూర్తి చేసిన కొడుకుని గుడి అర్చకత్వంలోకి తనకి చేదోడుగా తీసుకురావాలని తను చేసిన ప్రయత్నాలను కొడుకు తీవ్రంగా నిరసించాడు. అప్పుడు కానీ తనకి తెలియలేదు. ఖాడెంతగా ఎదిగాడో! వాడికి చదువుచెప్పే మాష్టారు పనిగట్టుకు వచ్చి కుర్రాడు చాలా తెలివైనవాడనీ, వాడికిష్టమైన రీతిలోనే జీవితాన్ని మలుచుకోనిమ్మని చెప్పి వెళ్ళేదాకా తనకి తెలియలేదు. తన ఆలోచనా పరిధి ఎంత చిన్నదో. తండ్రిగా తన అసమర్థతను వెటకరిస్తూ, తన జీవితాన్ని తను చూసుకుంటానంటూ ఇల్లు వదిలి వెడ్తూ కొడుకు అన్న మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. "కాలం చెల్లిన నీ సనాతన సంస్కృతి ఎవరికి కావాలి నాన్నా? నీకుమల్లే ఆ చిల్లుల పట్టు వస్త్రాల్ని కట్టుకుని అర్థం లేని వ్యర్థ మంత్రాలు చదువుతూ, మానవ జీవితంతో సంబంధం లేని, కన్పించని, లేని దైవాన్ని అర్చిస్తూ కూర్చోవాలా? అదేనా నా జీవితపరమావధి? నీ చిన్న గుడి చుట్టూ గిరి గీసుకుని అదే ప్రపంచమనుకోకు నాన్నా. కాలి క్రింద వేసుకుని మనిషి చెక్కిన విగ్రహాల కెదురుగా కూర్చుని శ్లోకాలు చదవడమే నా జీవికగా నేనంగీకరించలేను. అంతకన్నా చెప్పులు కుట్టుకుని జీవించడమే ఆత్మగౌరవమైన పని నా దృష్టిలో." ఎంత కటువైన మాటలు అన్నాడు! ఏడు తన కొడుకేనా? తను నమ్ముకున్న విలువల్లో ఎక్కడో లోపం వుందా? ఏమో! తను యింతకుమించి ఆలోచించలేదు. ఆలోచించడమంటే భయం! కొడుకు నిష్క్రమణతో పార్వతి హృదయం బ్రద్దలైంది మొదటిసారిగా. జీవితాన్ని ఏదో తెలియని వెలితి ఆవరించింది. కనిపించని విధి తనమీద తీసిన తొలి దెబ్బ అది.

తొలి గాయం మానకుండానే విధి మలి దెబ్బ తీసింది. బంగారపు బొమ్మలాటి పెద్ద కూతురు రుక్మిణి అందచందాలు చూసి మోజుపడి కట్నకానుకలు లేకుండానే ఓ సంబంధం కుదరడం, పెళ్ళి అయిందన్న సంతోషం కాళ్ళపారాణి ఆరేంతసేపు పట్టలేదు హరించుకుపోవడానికి. మోజు తీరిన తర్వాత అల్లుడికి కట్నం విలువ తెలిసివచ్చింది కాబోలు- రుక్మిణికి వంట్లో బాగా లేదు, వెంటనే రమ్మని కబురంది వెళ్ళేసరికి అంతా అయిపోయింది. కనిపించింది రుక్మిణి కాదు - పిడికెడు బూడిద! జరిగిన ఘోరం ఎవరితో చెప్పుకోవాలో తెలీక, ఏం చెయ్యాలో తెలీక కుమిలి కుమిలి ఏడ్చాడు. గుండె పగిలిన పార్వతి మంచం పట్టింది.

మొదటిసారిగా తనకి దైవం ఉనికిమీద సందేహం ఏర్పడింది. మానవ జీవితాలని శాసించే దైవమో మరొకటో వుంటే తామే పాపం చేసామని ఈ గుండె రంపపు కోత? ఊహ తెలిసినది మొదలుగా దేవిని అర్చిస్తున్నందుకు దేవి మెచ్చి ఇచ్చిన వరాలా కొడుకు దేశాలు పట్టిపోవడం, కూతురు దుర్మరణమూను? ఎవరు తీరుస్తారు తన సందేహాలు? తన కొడుకే నిజమా? దైవం లేదా? దైవశక్తి లేదా? తన జీవితానికి, తన అర్చనలకీ అర్థమే లేదా? అంతలోనే దైవం ఉనికినే అనుమానించిన తన దౌర్బల్యానికి ఖిన్నుడైపోయాడు. తనే జన్మలో ఏ పాపం చేసుకున్నాడో! ఎంత మనసును సమాధానపరచుకుందామనుకున్నా ఏదో అర్థవిహీనత! దేవి అర్చన సమయంలో మనసు తప్పతోంటే అఖండ దీపంపై చేయి పెట్టి కాల్చుకుని తనని తానే శిక్షించుకున్నాడు!

కొద్ది రోజులుగా మనసుని కలచివేస్తూన్న విషయం చిన్న కూతురి పెళ్ళి సంగతి. ఆ పిల్లకి పెళ్ళి చేసి పంపేస్తే తరువాత తనూ, పార్వతీ ఏమైనా ఫర్వాలేదు. తనలాటి చేతకాని వాడు పిల్లల్ని కనడం నేరం. తన స్థితికి జాలిపడి మొన్న పెళ్ళిళ్ళ పేరయ్య ఓ అనుకూలమైన సంబంధం తీసుకొచ్చాడు. జీవితంలో తనని ఏదీ కోరని పార్వతి ఓ కోరిక కోరింది- రేపు పెళ్ళి చూపులకి కూతుర్ని పట్టుచీరలో చూడాలని! ఎన్ని ఏళ్ళ నుంచి దాచుకున్న చిన్న కోరికో! భార్య కోరిన ఒకే ఒక కోరిక! కనీసం పెళ్ళి చూపులకైనా చిరుగుల చీర తప్ప మరో చీరలేని కూతురికి పట్టు చీరా! దుర్గమ్మకి ఎన్నో పట్టుచీరలు తన హస్తాలతో తానే అలంకరిస్తాడు. తనకి తెలిసింది దేవిని అలంకరించి సాష్టాంగ పడటం. భార్య కోరికకు అలాగే అని తలూపాడే కాని, భార్య కోరినట్టు నాయుడిని ఒక పట్టుచీర నోరు విడిచి అడగగలడా తను?

ఎన్నడూ ఏదీ అడగని తను అడిగితే నాయుడు పట్టుచీర ఇస్తాడేమో! ఇవ్వడో! తన పిరికితనమూ, ఆత్మాభిమానమూ మామూలే. అడగటానికని వెళ్ళి, అడగలేక తిరిగి వచ్చేసాడు! రేపు పెళ్ళి వారొస్తారు పిల్లని చూడటానికి. దేవి ముందు అర్చనకు కూర్చున్నా పట్టుచీర గురించి ఆలోచనలు బుర్రని కుదిపేస్తూన్నాయి. ఏ విధంగానూ తానో పట్టు చీర సంపాదించలేడు. అమ్మవారిపైనున్న పట్టు చీర తీసుకొచ్చి రేపు ఆ కాసేపూ పిల్లకి కట్టబెడితే? తప్పా? తనింత దిగజారి ఆలోచిస్తున్నాడేమిటీ రోజు? కొడుకు ఎకసక్కెపు నవ్వు ఎక్కడ నుండో వెక్కిరిస్తోంది. "నిన్ను చూస్తే జాలి వేస్తుంది నాన్నా. లోకాల్ని పాలించే దేవే వుంటే దుర్మార్గులైన రాక్షసులు అసలు పుట్టకుండానే చేయాలి. లోకాల్ని సృష్టించే దైవం ప్రమేయం లేకుండా దుర్మార్గం ఎక్కడి నుంచి ఎలా పుట్టుకొచ్చింది? రాక్షసులకి జడిసి దేవుళ్ళు లోకాలు వదిలి పారిపోవడం, వాళ్ళని చంపడానికి దేవుళ్ళు అవతారాలెత్తడం- దైవం అసహాయతని తెలియచెయ్యడంలేదా? మనిషి ఆలోచనా లేమికీ, విజ్ఞాన లేమికీ ప్రతిరూపమే దైవ భావం నాన్నా." కొడుకు చెప్పిందే నిజం కాబోలు! కానీ ముప్పావు జీవితం దేవి అర్చనలో గడిపిన తను ఈవాళ- దైవం ఉనికిమీదే విశ్వాసం బ్రద్దలైన వేళ నిరీశ్వరత్వాన్ని అంగీకరించగలడా? దైవం వుంటే వుండనీ, లేకపోతే లేకపోనీ- భార్య కోరిన చిన్న కోరిక తీర్చలేని జీవితం ఎందుకు అనే ఊహ, ధైర్యం ఇప్పుడు తనకి కలగడమే ఆశ్చర్యం! ఈ రాత్రి గుడికి వెళ్ళి దేవిపై వున్న పట్టుచీర తీసుకొస్తాడు. ఉదయమే కూతురికి కట్టబెట్టి భార్య తనివితీరా చూసాకా వెంటనే చీరని యథాస్థానంలో పెట్టేస్తాడు. ఇదేమీ దొంగతనం కాదే. డజన్లకొద్దీ అమ్మవారి పట్టుచీరల్ని కైంకర్యం చేసే నాయుడ్ని ఏమీ చేయని దేవి తను కాసేపు వాడుకుంటే శిక్షిస్తుందా? శిక్షించనీ. తన జీవితమంతా దేవి అర్చనకే వినియోగించినందుకు బహుమతిగా దేవి శిక్షనే ప్రసాదిస్తే సంతోషంగా స్వీకరిస్తాడు- భార్య కోరిక తీరితే చాలు! గవరయ్యగారి మనసు స్థిమితపడింది.

ఊరంతా మాటుమణిగిన అర్ధరాత్రి వేళ గవరయ్యగారు బయల్దేరి కాలవ ఈది ఆవలిగట్టు చేరి నడక సాగించారు. పున్నమినాటి పూర్ణచంద్రుణ్ణి పెద్ద మేఘం ఒకటి కప్పేసింది. గుడి తలుపులు తీస్తుంటే చలికో మరి దేనికో చేతులు వణికాయి. అఖండ దీపపు వెలుగులో అమ్మవంక చూసాడు. ఎర్ర అంచు లేత పసుపుపచ్చ చీరలో, మెరుస్తూ వజ్రపు ముక్కుపుడకతో, మెడలో విలువైన హారాలతో అభయ హస్తాలతో అమ్మ నవ్వుతోంది. ఆ నవ్వు తనకి బాల్యం నుండీ పరిచితమే. అడగకపోతే అమ్మ అయినా పెట్టదనుకుంటారు. కానీ అడక్కపోయినా పెట్టే అమ్మ అంటాడు తన కొడుకు. దేవుడమ్మేనా? తన పేదరికం, కడుపుబాధ అమ్మకి తెలీదా? లేక భక్తుల్ని పరీక్షిస్తోందా? నమ్మి కొలిచేవాళ్ళని కష్టాల ఊబిలో తొక్కి దైవం పరీక్షిస్తుందా? మళ్ళా ప్రశ్నలు! వద్దు తనకి ప్రశ్నలంటే భయం. జవాబులు తాను ఆలోచించలేడు. జరిగేది జరుగనీ. అమ్మవారి పట్టుచీర తీస్తోంటే ఎముకలు కొరికే ఆ చలిలో సైతం చెమట్లు పట్టాయి. చీర మడిచి పట్టుకుని తలుపులు వేస్తోంటే ఎవ్వడికి భౌభౌమంటూ లేచాడు భైరవుడు. ఎప్పుడో ఓ చిన్న కుంకుక్కపిల్ల గుడిదగ్గర ఆకలి కడుపుతో తారట్లాడుతోంటే ప్రసాదం పెట్టి చేరదీసాడు. అదీవాళ పెద్దపులిలా తయారై పెట్టని రక్షకభటుడిలా గుడిని కాపలా కాస్తోంది. ఈ రోజు అది తననే అడ్డగిస్తుందా? త్వరత్వరగా అడుగులు వేస్తోంటే భైరవుడు వెనకే పడింది మొరుగుతూ! తన గుర్తుపడితే మొరగడం మానేస్తుందేమో. అయినాసరే దాని దృష్టిలో దొంగలా పడటం తనకిష్టం లేదు. నడక వేగం హెచ్చిస్తూంటే ఆయాసం ఎగదన్నుతోంది. ఒక చేత్తో చీర పట్టుకుని కాలువలో దిగాడు. తరుముతూ వచ్చిన భైరవుడు కాలవగట్టున ఆగి మొరగసాగింది. చంద్రుడు మబ్బులోకి బయటకొస్తున్నాడు. గట్టున పడ్డ గవరయ్యగారు స్థిమితపడి ఇంటికి చేరుతూ ఆలోచించడం మొదలుపెట్టారు. ఉదయం తను చీర గురించిన ఆలోచనలో పడి భైరవుడికి మామూలుగా పెట్టే ప్రసాదం పెట్టలేదని గుర్తుకొచ్చింది. కూతురి వివాహంతోనైనా ఇంక తమ వంశంలో ఈ వెట్టి పూజారితనం ఆఖరైతే అదే పదివేలు అనుకుంటూ కలత నిద్రతో గడిపారు. భళ్ళున తెల్లవారింది. కూతురిని పట్టుచీరలో చూసిన పార్వతమ్మ మురిసిపోయింది. ఈ పేద పూజారి వృత్తి తన భర్తతోనే అంతరించిపోవాలని మనసులోనే వెయ్యి దేవుళ్ళకి మొక్కింది గవరయ్యగారితో తన పెళ్ళిని తలుచుకుంటూ. పెళ్ళివారు రానే వచ్చారు. అమ్మాయి ఎలా వుంది బాబూ అని అడిగిన పెళ్ళివారయ్యగారి ప్రశ్నకు "అమ్మవారులా వుంది" అని సిగ్గుపడుతూ చెప్పిన పెళ్ళికొడుకుని చూసి గవరయ్యగారి గుండెల్లో రాయి పడింది. పేరయ్యను అడగలేక అడిగారు అబ్బాయి ఏం చేస్తాడని. గంతకు తగ్గ బొంత అని ముందే చెప్తానుగదా, పెళ్ళికొడుకు సింగరాయపాలెంలో పూజారి అని పేరయ్య చెపుతోన్న సమాధానం పార్వతమ్మకు గుండెల్లో శూలంలా దిగబడింది.



డాక్టర వేగంటగా పెంచేది

ప్రాణం పోవడానికి, నిలపడానికి గల తేడా ఒకోసారి కొన్ని క్షణాలే. ఈ కారణంగా న్యూయార్క్‌లోని 'బెర్ వ్యూ' హాస్పిటల్‌లోని డాక్టర్లు వారి పాదాలకి బూట్లు బదులు చక్రాల స్కేటింగ్ బోర్డ్ కట్టుకుని వేగంగా తిరుగుతుంటారు. ఇంటికెళ్ళేప్పుడు మళ్ళీ వీటిని విప్పి తమ షూస్ వేసుకెళ్తారు.

—ఎం.